క్లుప్తంగా

స్పందనలో నాలుగు అర్జీలు



తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు నాలుగు ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో ఇళ్ల పట్టాకు సంబంధించి ఒక ఫిర్యాదు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని, రక్షిత మంచినీరు రావడం లేదని, పింఛన్ ఇప్పించాలని ఫిర్యాదులు వచ్చినట్లు మున్సిపల్ రెవెన్యూ అధికారి సోమశేఖర్ యాదవ్ తెలిపారు. వీటిని పరిశీలించి ఉన్నతాధికారుల సూచనల మేరకు తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కరాటేలో కఠెవరం విద్యార్థుల ప్రతిభ



తెనాలిరూరల్: కరాటేలో తెనాలి మండలం కఠెవరంకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చారు. చిలకలూరిపేటలో ఆదివారం జరిగిన జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ నేషనల్ కరాటే ఛాంపియన్ పోటీల్లో కఠెవరంలోని నివాస్ కరాటే అండ్ మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు 12 మంది పాల్గొన్నారు. వీరిలో 10 మంది బంగారు పతకాలు సాధించగా ఒకరు రజత, మరొకరు కాంస్య పతకాలను పొందారు. కోచ్ కిరణ్ రెడ్డి, విద్యార్థులను సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తెనాలి పట్టణ కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, సుధాకర్ అభినందించారు.

చావావారిపాలెంలో విద్యార్థినుల శ్రమదానం



తెనాలిరూరల్: నేషనల్ సర్వీస్ స్కీమ్‌లో భాగంగా తెనాలి జేఎంజే మహిళా కళాశాల విద్యార్థులు మండలంలోని చావావారిపాలెంలో సోమవారం శ్రమదానం చేశారు. గ్రామంలోని మురుగు కాల్వలను శుభ్రం చేయడంతో పాటు గ్రామంలో మొక్కలు నాటారు. ఇంటింటికి మొక్కలు అందించారు. గ్రామ పెద్దలు గాలి కిరణ్, నిమ్మగడ్డ లక్ష్మి, చావ శివకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.అరుణ, సుజాత పర్యవేక్షించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు హాజీ అహ్మద్ చారిటబుల్ ట్రస్ట్-కోవిడ్ ఫైటర్స్, గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం 85 మంది విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు, పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి రాజీవ్ రత్న, చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి అబ్దుల్ రెహ్మాన్, కోవిడ్ ఫైటర్స్ ప్రతినిధి అల్లా భక్షు, ఉపాధ్యాయులు బి. శ్రీనివాసరావు, రాజారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

మంగళగిరి: నూజివీడు నుంచి నెల్లూరు జిల్లాకు అక్రమంగా తరలివెళుతున్న రేషన్ బియ్యం లోడు లారీని మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధి కాజ టోల్‌ప్లాజా వద్ద సోమవారం రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. లారీలో 620 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని మంగళగిరి రూరల్ స్టేషన్‌కు తరలించినట్లు పౌరసరఫరాల శాఖ డీటీ దుర్గారావు తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్పీ ఈశ్వర్, సీఐ శ్రీహరి పాల్గొన్నారు.

రేపు గౌతమ బుద్ధా రోడ్ ప్రారంభం

మంగళగిరి: నగరంలోని ప్రధాని రహదారి గౌతమ బుద్ధా రోడ్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈనెల 6వ తేదీన ఈ రహదారిని ప్రారంభించేందుకు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ప్రత్యేక చొరవతో సుమారు రూ.12 కోట్ల నిధులతో ఈ రహదారి విస్తరణ పనులు చేపట్టగా ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. ఈనేపథ్యంలో ఈనెల 6న గౌతమ బుద్ధా రోడ్‌ను ప్రారంభించేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. సోమవారం ఎమ్మెల్యే ఆర్కే నగర పాలక సంస్థ అధికారులతో కలసి గౌతమ బుద్ధా రోడ్ విస్తరణ పనులను పరిశీలించారు. చినకాకాని ఎన్నారై ఆసుపత్రి సమీపంలో నిర్మిస్తున్న గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని, ఏపీఐఐసీ సర్కిల్ వద్ద దివంగత నేత, మాజీ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే తెలిపారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాలకు శాశ్వత హక్కుపత్రాలు

- సర్వహక్కులతో పేదలకిస్తున్న ప్రభుత్వం ఇది
- తెనాలిలో రికార్డు స్థాయిలో 27 వేల మందికి ఇళ్ల స్థలాలు
- దేవుడు జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో నాచేత ఇప్పించాడు
- కన్వేయన్స్ డీడ్స్ పంపిణీ సభలో ఎమ్మెల్యే శివకుమార్



కన్వేయన్స్ డీడ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, పక్కన చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న, వైస్ చైర్మన్లు

తెనాలి: ఓటు వేసి గెలిపించిన ప్రజల ఆశలను వమ్ము చేయకుండా విలువైన ఇంటి స్థలాన్ని పంపిణీ చేసి, ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేసి మరీ సంపూర్ణ హక్కులతో శాశ్వత పట్టాను అందజేస్తున్నందుకు గర్వకారణంగా ఉందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. నియోజకవర్గంలో 2.64 లక్షల మంది ఓటర్లలో రెండు లక్షల మందికి సంక్షేమ ప్రయోజనం చేకూర్చగలిగినట్టు చెప్పారు. చేసిన మేలును చెప్పి, మద్దతు ఇవ్వమని ప్రజలను అడిగే హక్కు తనకు మాత్రమే ఉందన్నారు. అందుకే మేలు జరిగిన ప్రతి కుటుంబం సీఎం జగన్ మోహన్‌రెడ్డిని, తనను ఆశీర్వదించాలని కోరారు. పట్టణంలోని 1-20 వార్డుల్లో పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసిన కన్వేయన్స్ డీడ్స్‌ను ఎమ్మెల్యే శివకుమార్ సోమవారం పంపిణీ చేశారు. స్థానిక తాలూకా హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన భారీ సభలో 20 వార్డులకు కలిపి 8,699 మందికి అందజేశారు. తెనాలి నియోజకవర్గంలో గతంలో ఏ ఎమ్మెల్యే హయాంలోనూ లేనివిధంగా దేవుడు జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో తనచేత 27 వేల మందికి ఇళ్ల స్థలాలను ఇప్పించినట్టు చెప్పారు. వార్డు సభలు పెట్టి మరీ అర్హులైన అందరి నుంచి తాను దరఖాస్తులు తీసుకున్నట్టు గుర్తు చేశారు. 'ఇంతమందికి ఇళ్లస్థలాలు ఎక్కడిస్తాడు...ఈ దెబ్బతో శివకుమార్ అయిపోయాడు' అనుకుంటూ అప్పట్లో చంకలు గుద్దుకున్నారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ భూమి ఏమాత్రం అందుబాటులో లేకున్నా, అద్దె ఇళ్లల్లో మగ్గుతున్న పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకోసం 580 ఎకరాలను కొనుగోలు చేసి 27 వేల మందికి ఇళ్ల స్థలాలను ఇచ్చామన్నారు. పట్టణంలో 20,234 మందికి ఇచ్చినట్టు గుర్తు చేశారు. పట్టాలను ఇచ్చి ఊరుకోకుండా ఆయా కాలనీల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఒక్కో ఇంటిస్థలం విలువ రూ.4.80 లక్షల నుంచి రూ.5.80 లక్షలు ఉందన్నారు. పేదలకు ఇచ్చిన ఇళ్లస్థలాలపై వారికి శాశ్వత హక్కు కల్పించేలా చట్టాన్ని సవరించి మరీ రిజిస్ట్రేషన్ చేసి సర్వహక్కులతో ఇప్పుడు పత్రాలను అందిస్తున్నామని వివరించారు. నియోజకవర్గంలో రూ.1,800 కోట్ల సంక్షేమాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశామన్నారు. 39 వేలమందికి ప్రతినెలా రూ.10 కోట్ల 86 లక్షలు పింఛను మొత్తాన్ని ఇస్తున్నట్టు చెప్పారు. సంక్షేమం ఇచ్చిందీ, ఇళ్లస్థలాలను శాశ్వత పట్టాలతో సహా ఇస్తున్నదీ నిజమైతేనే మద్దతు నివ్వాలని, తననూ, జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ముందుగా మహిళలకు అందించనున్న శాశ్వత హక్కు పత్రాలతో ఎమ్మెల్యే శివకుమార్ సర్వమత ప్రార్థనలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మున్సిపల్ వైస్ చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, తోట రఘురామ్, వీరిశెట్టి నాగమల్లేశ్వరి, తిరుమలశెట్టి సామ్రాజ్యం, కఠారి రత్నకుమారి, కొర్ర యశోద, కుర్రా సుజాత, దాసరి వీరవసంతరావు, గుంటూరు కోటేశ్వరరావు, షేక్ గౌసియా రాష్ట్ర జలవనరుల కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కృష్ణబలిజ, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, పార్టీ పట్టణ అధ్యక్షులు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న పింఛన్ల పంపిణీ



ఐతానగర్‌కు చెందిన మహితేజకు వికలాంగ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ షైనీ



రంగారావుకు వీవర్స్ పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ రవికుమార్

తెనాలిఅర్బన్: వైఎస్సార్ పింఛన్ కానుక తెనాలి పట్టణంలో చివరి దశకు చేరింది. పట్టణంలోని 90 శాతంపైగా లబ్ధిదారులకు పింఛన్లు వార్డు వలంటీర్లు, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు పంపిణీ చేశారు. సోమవారం కూడా మిగిలిన వారి ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. ఐతానగర్‌కు చెందిన తెనాలి సంజయ్ మహితేజకు వికలాంగ పింఛన్ వలంటీర్ మేకల షైనీ, అడిగోపుల రంగారావుకు వీవర్స్ పింఛన్ ములికి రవికుమార్, పోకూరి మరియమ్మకు వృద్ధాప్య పింఛన్ తలతోటి బర్నబా పంపిణీ చేశారు.



మరియమ్మకు పింఛన్ అందజేస్తున్న బర్నబా

సంచారజాతుల పిల్లలకు పోలియో చుక్కలు



కంచర్లపాలెంలో పోలియో చుక్కలు వేస్తున్న సురేష్

తెనాలిటౌన్: పల్స్ పోలియో సందర్భంగా కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో 5 సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు తెలిపారు. కొమ్మమూరు కాల్వకట్టపై నివసిస్తున్న సంచార జాతుల కుటుంబాల్లోని పిల్లలకు పోలియో చుక్కలు సోమవారం వేసినట్లు చెప్పారు. ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి సర్వే చేసి ఇంకా ఎవరైన చిన్నారులు ఉంటే వారికి చుక్కలు వేసినట్లు తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటి సర్వే చేసినట్లు చెప్పారు. కంచర్లపాలెంలో ప్రాథమిక పాఠశాలలోని కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు సర్పంచ్ కోపల్లె మణిమ్మ, సురేష్‌లు వేశారు. ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసులు, సీఐఎస్ఎఫ్ కవాతు



కవాతులో డీఎస్పీ రమేష్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కోటేశ్వరరావు సిబ్బంది

తెనాలిరూరల్: ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని డీఎస్పీ ఎం.రమేష్ సూచించారు. మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ సిబ్బంది అలాగే సీఐఎస్ఎఫ్ బలగాలు కలిసి సంయుక్తంగా పట్టణంలో ఆదివారం రాత్రి రూట్ మార్చ్ చేశారు. వన్ టౌన్ సీఐ జి.దశరధరామారావు నేతృత్వంలో పోలీస్ అధికారులు, సిబ్బంది సీఐఎస్ఎఫ్ బలగాలతో కలిసి రాత్రి రూట్ మార్చ్ చేశారు. రాత్రి 9 గంటలకు ప్రారంభించి 11 గంటల సమయం వరకూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో కవాతు చేశారు. గాంధీచౌక్, శివాజీచౌక్, బోసురోడ్డ్, మార్కెట్ ఏరియా, షరాఫ్‌బజార్, వహాబ్‌చౌక్, దేవిచౌక్ తదితర ప్రాంతాల్లో పోలీసులు రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ దశరధ రామారావు మాట్లాడుతూ, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అలాగే మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన పెదరావూరు, అంగలకుదురు, సంగంజాగర్లమూడిలో డీఎస్పీ ఎం.రమేష్, రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కోటేశ్వరరావుల నేతృత్వంలో సోమవారం ఉదయం కవాతు నిర్వహించారు. త్రీ టౌన్ పోలీసులు సాయంత్రం పట్టణంలో కవాతు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎన్నికల్లో ఎలాంటి భయాందోళనకు లోను కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసులు మీ వెంటే ఉంటారన్న నమ్మకాన్ని కల్పించేందుకు పోలీస్ రూట్ మార్చ్ చేసినట్లు తెలిపారు. పోలీస్ అధికారులతో పాటు పోలీస్ సిబ్బంది, స్పెషల్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీసీ ఫ్యాక్టరీ భూములను కాపాడాలి



భూములను పరిశీలిస్తున్న కార్మికులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన భూములను కార్మికులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులు కూరపాటి స్టీవిన్, ఆదినారాయణ మాట్లాడుతూ సిమెంట్ కంపెనీకి చెందిన భూములను అన్యాయంగా అమ్మకాలు సాగిస్తున్నారని ఆరోపించారు. హద్దు రాళ్ల వేసి భూములను దొడ్డిదారిన రిజిస్ట్రేషన్ చేస్తున్నారని అన్నారు. సాయిబాబా గుడి ఉన్న ప్రాంతంలో భూములను కూడా అమ్మి హద్దులు వేశారని, ఏసీసీ భూములకు సంబంధంలేని వ్యక్తులు చొరబడి భూములను అమ్ముకుంటూ వెళితే కార్మికులకు రావలసిన బకాయిలకు ఏసీసీ భూములు ఉండవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి అన్యాక్రాంతమైన భూములను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వై.యెహోషువా, తుపాకుల నాగేశ్వరరావు, ఎం.ఆశీర్వాదం, ఎమ్మిల చెట్టి పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురు అరెస్ట్



తెనాలిరూరల్: గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. స్థానిక త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ ఎం.రమేష్ వివరాలు వెల్లడించారు. తెనాలి పట్టణం నుంచి బాపట్ల జిల్లా చుండూరు మండలం చినపరిమి గ్రామానికి వెళ్లే డొంక రోడ్డులో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు నేతృత్వంలో ఎస్ఐ నక్కా ప్రకాశరావు, ఏఎస్ఐ షేక్ హైదర్ అలీ, పీసీలు పి.మురళి, ఎం.అంకయ్య, శ్రీహరి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఐదుగురు వ్యక్తులు గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్టు గుర్తించారు. పోలీసుల రాకను పసిగట్టిన నిందితులు పరారయ్యేందుకు ప్రయత్నించారు. పోలీసులు వెంటపడగా నలుగురు పట్టుబడ్డారు. వీరిని సంగంజాగర్లమూడికి చెందిన మహమ్మద్ అబ్దుల్ రషీద్, తెనాలి నందులపేటకు చెందిన కోటి సాయిమంజునాథ్, దేవరకొండ మను శివ శంకర్, బుర్రిపాలెం రోడ్డు బీసీ కాలనీకి చెందిన కోట సురేంద్రలుగా గుర్తించారు. వీరి వద్ద నుంచి చిన్న చిన్న పొట్లాల్లో ఉంచిన 1.20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నర్సీపట్నం వెళ్లి గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చి ఇక్కడ అధిక ధరకు విక్రయిస్తున్నారని పోలీసుల విచారణలో వెల్లడైంది. పరారైన నిందితుడి కోసం గాలిస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం నడిగడ్డపాలెం రైల్వే గేటు సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని సోమవారం పరిశీలించారు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతదేహం నుజ్జునుజ్జయ్యింది. పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

తెనాలిరూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు కేసులు నమోదు చేశారు. తెనాలి మండలం నందివెలుగు గ్రామంలో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇద్దరు వ్యక్తులు మద్యం విక్రయిస్తుండడాన్ని గుర్తించి పరిశీలించారు. ఇద్దరి వద్ద 20 సీసాలు లభించడంతో వాటిని స్వాధీనపర్చుకుని ఇద్దరిపై కేసులు నమోదు చేశారు.

14 ఏళ్లలోపు పిల్లలందరు బడికి వచ్చేలా చూడాలి



రికార్డు తనిఖీ చేస్తున్న ఎంఈవో లక్ష్మీనారాయణ

తెనాలిరూరల్: 14 ఏళ్లలోపు బాలలందరూ బడికి వచ్చేలా చూడాలని మండల విద్యాశాఖ అధికారి మేకల లక్ష్మీనారాయణ ఉపాధ్యాయులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మండల గ్రామం కఠెవరంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. గ్రామంలో 14 ఏళ్లలోపు బాలలందరూ పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. బడి బయట ఉన్న పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడాలని చెప్పారు. ఆయన వెంట ఉపాధ్యాయులు వీబీ పద్మలతాభాస్కర్, వి.అంకినీడు ప్రసాద్, ఎం.మాధవీలత, పీవీఎస్ జగన్నాథం ఉన్నారు.

స్టోరేజీ యజమాని నిర్వాకం వల్లే...

- పసుపు రైతులు రూ.115 కోట్ల సంపద కోల్పోయారు
- సబ్‌కలెక్టర్‌కు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర నేతలు వినతి



సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతునేతలు

తెనాలి: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ యజమాని నేరపూరిత ఆలోచనతో ఇన్సూరెన్స్ కంపెనీకి డబ్బులు చెల్లించనందున పసుపు రైతులు రూ.115 కోట్ల సంపదను కోల్పోయారని, ప్రభుత్వం కోల్డ్‌స్టోరేజీ యజమానిపై చర్యలు తీసుకోవాలని రైతుసంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, కార్యదర్శి కె.ప్రభాకర రెడ్డి ఆధ్వర్యంలో రైతునేతలు సోమవారం తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ను కలిసి ఆ ప్రకారం వినతి పత్రం అందజేశారు. మార్కెట్ యార్డు, కోల్డ్ స్టోరేజీ యజమాని ప్రకటించిన జాబితాల్లో రైతుల సంఖ్యలో వ్యత్యాసం ఉందని తెలిపారు. 30 వేల బస్తాల తేడా ఎందుకు వచ్చిందో తెలియక రైతులు గందరగోళ పడుతున్నారని వివరించారు. ప్రభుత్వం స్పందించి ప్రస్తుత మార్కెట్ రేటు క్వింటాలు రూ.13 వేలు ధరను ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు ములకా శివ సాంబిరెడ్డి, బాధిత రైతుల కమిటీ కన్వీనర్ వేములపల్లి వెంకట్రామయ్య పాల్గొన్నారు.

'స్పందన'లో తొమ్మిది దరఖాస్తులు

స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన సమావేశానికి వివిధ సమస్యలపై తొమ్మిదిమంది దరఖాస్తులు అందజేశారు. సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ అర్జీలను స్వీకరించారు. రెవిన్యూకు సంబంధించి అయిదు, పంచాయతీ పరిధిలోనివి రెండు, డీఆర్‌డీఏ పీడీ పరిధి సమస్యపై ఒకటి, జిల్లా అగ్నిమాపక అధికారికి సంబంధించి మరొక అర్జీ వచ్చినట్టు తెలిపారు. అర్జీలను నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరించేలా చూస్తామని తెలియజేశారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి



ఆరవ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప



23వ వార్డులో ఓట్లు అభ్యర్థిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్లు

తెనాలిఅర్బన్: వచ్చే సాధారణ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. పట్టణంలోని ఆరవ వార్డులో సోమవారం సాయంత్రం అన్నాబత్తుని పుష్ప, 23వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని, అభివృద్ధిని తెలియజేసి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో 6వ వార్డులో రాష్ట్ర కృష్ణబలిజ పూసల ఫెడరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, కౌన్సిలర్ తిరుమలశెట్టి సామ్రాజ్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతిరెడ్డి హేమలత, నీలి అజయ్, సిరి కృష్ణ, కఠారి హరీష్, టెక్స్ బాల, షేక్ గఫూర్, పోతిరెడ్డి నాగరాజు, నీలి కవిత, త్రినాథ్, రవికుమార్, కె.శ్రీనివాస్, 23వ వార్డులో కౌన్సిలర్లు తోక శిరీష, పెదలంక లక్ష్మీ లావణ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పెదలంక వెంకటేశ్వర్లు, సుబ్రమణ్యం, సీమోను, లక్ష్మి, తాడిబోయిన రమేష్, జానీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షేమం అందించిన ప్రభుత్వానికి ఓటు వేయండి



కరపత్రాలు పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే చిన్న కుమారుడు అఖిల్ గణేష్

పిడపర్రు(కొల్లిపర): రాష్ట్రంలో ప్రతి పేదవానికి సంక్షేమం అందించిన వైఎస్సార్‌సీపీ పార్టీకి ఓటర్లు తమ అమూల్యమైన ఓట్లు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చిన్న కుమారుడు అఖిల్ గణేష్ కోరారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పిడపర్రు గ్రామంలో అఖిల్ గణేష్ స్థానిక పార్టీ నాయకులతో కలసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ కరపత్రం అందజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, తన తండ్రి అన్నాబత్తుని శివకుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దూరు రత్నబాబు, వంగా సుధాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం ద్వారా ప్రజలకు సంక్షేమం అందించాం

- కొలకలూరు రూ.104 కోట్లతో ప్రజలకు సంక్షేమం
- గ్రామ పార్టీ అధ్యక్షుని ప్రమాణస్వీకార సభలో ఎమ్మెల్యే శివకుమార్



గ్రామ పార్టీ అధ్యక్షునిగా ప్రమాణం చేస్తున్న సురేష్, పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: నాలుగున్నరేళ్ల పరిపాలక ప్రభుత్వం ద్వారా ప్రజలకు సంక్షేమం అందించామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. కొలకలూరు గ్రామంలో రెండు సచివాలయాల పరిధిలో రూ.104 కోట్లు ప్రజలకు నేరుగా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. రూరల్ మండలం కొలకలూరులో పురవేదికపై జరిగిన గ్రామ పార్టీ అధ్యక్షులు ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ అధ్యక్షునిగా ప్రసాదం సురేష్, గ్రామ యువజన విభాగం అధ్యక్షునిగా కోలంటి దాసుల చేత ఎంపీటీసీ సభ్యులు కాలిశెట్టి ఫణి కుమార్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఫణికుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా పనిచేశామన్నారు. అవ్వతాతలకు ఆర్థిక భద్రత పెరిగిందని, పింఛన్‌ల పంపిణీ ద్వారా వారికి ఇబ్బంది లేకుండా చేశామన్నారు. వితంతు, వృద్ధులు, వికలాంగుల సుమారు వెయ్యి కుటుంబాలకు పింఛన్‌లు అందిస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని, మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ నవరత్నాల పథకాల ద్వారా పేదలందరి సంక్షేమానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పనిచేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే శివకుమార్ సహకారంతో ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించామని తెలిపారు. సభలో వైస్ ఎంపీపీ కోడూరు స్వప్న, టీసీఎంఎస్ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, లక్ష్మీ కోటేశ్వరరావు, బాలరాజు, మన్నవ ప్రభాకర్‌లు మాట్లాడారు. ప్రమాణస్వీకారం చేసిన సురేష్, దాసు, మల్లవరపు భరత్, నవీన్, అజ్గర్‌లను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు చెక్కా సీతమ్మ, గంపల వెంకటేశ్వరరావు, కోడూరు రమేష్, మల్లవరపు విజయ్, కొలకలూరి పాపారావు, ప్రసాదం రాధారావు, నల్లూరి సుమతి, అకరంశెట్టి నాగేశ్వరరావు, వేముల మహేష్, కుర్రా జస్వంత్, ఉన్నం చినజాన్, వీరమల్లు కార్తికేయ, షేక్ బాజి, అంచే రోశయ్య, పోలిశెట్టి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మ సేవా శాంతి ఆశ్రమంలో వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు సోమవారం వృద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. యోగా సభ్యులు ఎం.రాజమ్మ జ్ఞాపకార్థం ఎస్వీ యోగ కన్వీనర్ ఎం.రమణయ్య దంపతులు సేవా కార్యక్రమం నిర్వహించారు. కన్వీనర్ రమణయ్య మాట్లాడుతూ యోగా సభ్యులు పుట్టిన రోజు, పెళ్లి రోజు వేడుకలు వృద్ధుల సమక్షంలో జరుపుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, వై.కోటేశ్వరరావు, ఎస్.యేసుబాబు, పలువురు యోగ సాధకులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com